పత్తి సాగు.. లాభాలు బాగు

జల్లులు పడిన వెంటనే విత్తవద్దు

- హైబ్రిడ్ రకాలు ఎంపిక చేసుకోవాలి
- వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్ టౌన్: ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంటను జహీరాబాద్ ప్రాంతంలో రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. పత్తి నాటడం నుంచి చేతికి అందేవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి వివరించారు. సరైన జాగ్రత్తలు పాటించి సాగుచేస్తే అధిక దిగుబడులు సొంతం చేసుకోవచ్చని ఆయన చెప్పారు.



భిక్షపతి, ఏడీఏ

పత్తి పంట(ఫైల్)

సలహాలు.. సూచనలు

- పత్తికి నల్లరేగడి నేల అనుకూలం. ఎర్రనేలల్లో కూడా సాగుచేసుకోవచ్చు
- ఒకటి రెండు తేలికపాటి జల్లులు పడిన వెంటనే తొందరపడి పత్తి గింజలు విత్తవద్దు
- కనీసం 50మి.మీ వర్షం పడిన తరువాతనే విత్తాలి
- అప్పుడే భూమిలో వేడి తగ్గి మొలక శాతం బాగుంటుంది
- ఎర్రనేలల్లో జూన్, జూలై మొదటి పక్షంలోనూ నల్లరేగడి నేలల్లో జూన్, జూలై చివరి పక్షంలోనూ విత్తుకోవాలి
- రైతులు తమ ప్రాంతానికి తగ్గట్టు అనువైన హైబ్రిడ్ విత్తనాలను ఎంపిక చేసుకోవాలి
- వర్షాధారంపై ఆధారపడినప్పుడు తొందరగా పూతవచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి
- ఎర్రనేలల్లో వర్షాధారంగా బీటీ విత్తనాలను సాగుచేయొద్దు
- బీటీ విత్తనాలను సాగుచేసే రైతులు మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండేటట్లు చూసుకోవాలి
- బీటీ గింజలతోపాటు ఇస్తున్న నాన్‌బీటీ గింజలను బీటీచుట్టూ ఎర పంటగా తప్పనిసరిగా విత్తాలి
- గింజలను విత్తిన వెంటనేగాని మరుసటి రోజుగాని భూమిలో తగినంత తేమ ఉండేలా చూసుకుని ఎకరాకు 1.2లీటర్ల పెండిమిథాలిన్ 200లీటర్ల నీటిలో కలుపుకుని భూమిపై సమానంగా పిచికారీ చేసుకోవాలి. దీని వల్ల కలుపు మొక్కలను తగ్గించుకోవచ్చు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- అధికతేమ వల్ల పత్తివేర్లకు ప్రాణవాయువు అందక మొక్కలు నీరసించి పూత, గూడు రాలిపోయి, ఏర్పడిన కాయలు కుళ్లిపోతాయి
- అందుకే 60–80 రోజుల వ్యవధిలో చేలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- వీలైనంతగా భూమిలో తేమను తగ్గించడానికి అంతర సేద్యం చేపట్టాలి
- ఎకరాకు 25కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువును అందించాలి
- అంతరకృషి ఆలస్యమైతే పంటకు నష్టం కలిగే అవకాశం ఉంది
- పత్తికి రసంపీల్చే పురుగులైన పచ్చదోమ, తామర పురుగులు ఎక్కువగా ఆశిస్తాయి
- వాటి నివారణకు మోనోక్రోటోపాస్ 1.6మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ లేదా ఎసిటామెప్రిడ్ 0.2గ్రా. లేదా ఎసిఫేట్1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి
- వర్షాలు అధికమైతే బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఎక్కువగా ఆశించి కాయలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది
- 10లీటర్ల నీటికి 30 గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్ అలాగే 1 గ్రాము పోషామైసిన్ కలిపి పిచికారీ చేయాలి
- వేరుకుళ్లు తెగులు, ఎండు తెగులు, వర్టిసీలియం తెగులు ఆశిస్తే నివారణకు లీటరునీటికి మూడు గ్రాముల కార్బండజిమ్ కలిపి మొక్కల మొదళ్లలో వేయాలి

క్లుప్తంగా

మంత్రివర్గంలో చోటు కల్పించాలి

నారాయణఖేడ్: త్వరలో చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డికి చోటు కల్పించాలని ఆర్యవైశ్య సంఘం మండలశాఖ అధ్యక్షుడు రాజు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.రాజుశంకరమ్మతోపాటు గిరిజన నాయకులు కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఖేడ్ నియోజకవర్గానికి మాత్రమే ఇంతవరకు మంత్రి పదవి దక్కలేదని వాపోయారు. మంత్రివర్గంలో సంజీవరెడ్డికి స్థానం కల్పించి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు.

నకిలీలు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీచేస్తున్న ఏఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): నకిలీ విత్తనాల సరఫరాను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య, హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని చాల్కి, న్యాల్‌కల్‌లో పురుగు మందులు, ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని దుకాణదారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే లైసెన్స్‌ను రద్దుచేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విక్రయాలకు సంబంధించి రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, అలాగే విత్తనాలు, ఎరువుల ధరలను తెలిపే బోర్డులను తప్పకుండా ఉంచాలని సూచించారు.

స్కూటీని ఢీకొట్టిన ఆటో

పటాన్‌చెరు టౌన్: ఆటో స్కూటీని ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన వంశీ కంపెనీ పనిపై సోమవారం బాచుపల్లి నుంచి పాశమైలారం వైపు వస్తుండగా కిష్టారెడ్డిపేట్ వద్ద ఓ ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వంశీ బంధువు హరిచంద్ర ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలు.. పరుగోపరుగు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని చెట్లపోతారం, గడ్డపోతారం, అల్లీనగర్ గ్రామాల్లో ఇంటి బయట నిలిపిన వాహనాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీలను దొంగిలిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున బ్యాటరీలను చోరీ చేస్తుండగా గ్రామస్తులు గమనించి వారిని వెంబడించారు. పట్టుబడక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు నెలల నుంచి ట్రాక్టర్‌లు, బైక్‌లు ఇతర వాహనాల నుంచి బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయని స్థానికులు వాపోయారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేపట్టాలని పోలీసులను కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన టీవీ, కంప్యూటర్లు

మునిపల్లి(అందోల్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పలు గ్రామాల్లో టీవీలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఫ్యాన్‌లు కాలి బూడిదయ్యాయి. మంగళవారం ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత విద్యుత్ అధికారులపై మండిపడ్డారు. తరచూ విద్యుత్ అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. విద్యుత్ ఏఈ ప్రశాంత్‌ను వివరణ కోరగా ఉరుములు, మెరుపులు, గాలి దుమారం వల్ల విద్యుత్ అంతరాయం కలుగుతుందని, సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడానికి సిబ్బంది కృషి చేస్తున్నారని చెప్పారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికుడు

నారాయణఖేడ్: వర్షాకాలం సమీపిస్తున్నందున మున్సిపాల్టీ పరిధిలో సోమవారం నుంచి ప్రారంభించిన పారిశుద్ధ్య పనులు మంగళవారం కూడా కొనసాగాయి. పలువార్డుల్లోని మురుగు కాల్వల్లో పెరిగిన పొదలు, పేరుకుపోయిన మురుగును తొలగించి బ్లీచింగ్ పౌడరు చల్లారు. పలు కాలనీల్లోని మినీట్యాంకుల చుట్టుపక్కల క్లోరినేషన్ పనులు నిర్వహించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్, నీటి సరఫరా విభాగం సూపర్‌వైజర్ శ్రావణ్ కుమార్ ఆయా పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దారంశంకర్ తనిఖీచేసి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు.

మెదక్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

పటాన్‌చెరు టౌన్: మెదక్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చేనెల 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాల వెల్లడి సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున అవగాహన ఉన్న ఏజెంట్లను నియమించాలని మంత్రి సూచించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖరారైందని మంత్రి ధీమా వ్యక్తం చేసినట్లు మధు తెలిపారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధు

కంపోస్టు షెడ్లు వినియోగంలోకి తేవాలి

డీపీఓ సాయిబాబా

కంగ్టి(నారాయణఖేడ్): పంచాయతీలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిర్మించిన డంపింగ్ యార్డులను తక్షణమే వినియోగంలోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఎంపీడీఓ సత్తయ్యను ఆదేశించారు. మండలంలోని రాంతీర్థ్ గ్రామంలోని పల్లెప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం తదితర అభివృద్ధి పనులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న కంపోస్టుషెడ్లలో వర్మీకంపోస్టు తయారీతోపాటు క్రీడా ప్రాంగణం స్థానికులకు ఉపయోగంలోకి తేవాలన్నారు. నర్సరీలో మొక్కలను ఏపుగా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సంజీవరావు, ఎంపీఓ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లోక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును తనిఖీ చేస్తున్న డీపీఓ సాయిబాబా

వరి కొయ్యలను కాల్చొద్దు

ఏడీఏ నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): వరికొయ్యలను కాలిస్తే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని ఏడీఏ నూతన్‌కుమార్ చెప్పారు. మంగళవారం సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాంలో వరి కొయ్యలను కాల్చడం చూసి రైతులకు అవగాహన కల్పించారు. కాల్చడం ద్వారా భూమి సారాన్ని కోల్పోతుందని చెప్పారు. నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం, దిగుబడి తగ్గుతుందని, భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోయి పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయని వివరించారు. అలాగే పంటకు మిత్ర పురుగులు మరణిస్తాయని చెప్పారు. వరి కొయ్యలను కాల్చకుండా నేలలో కలియదున్నడం వల్ల భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5నుంచి 10శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శశాంక్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నూతన్‌కుమార్

పోచమ్మ తల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండల పరిధిలోని శేర్‌ఖాన్ పల్లి శివారులో ఉన్న పలుగు పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలుపడి అన్నదాతలు సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, రామచంద్రారెడ్డి, రమేశ్, ఆగమయ్య, లక్ష్మీనారాయణ విఠల్, మహేశ్, గౌడ్, వెంకటేశ్, గౌడ్, రామకృష్ణ, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి..

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఊట్ల గ్రామంలోగల అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ ఈ పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని సునితారెడ్డి ఆకాంక్షించారు. జింకల శివరాజ్, ఆంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

30 వరకు జొన్నల కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న ఏడీ సత్యనారాయణ

ఏడీ సత్యనారాయణ

మునిపల్లి(అందోల్): రైతులను ఇబ్బంది పెట్టకుండా జొన్నలను కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారి ఏడీ సత్యనారాయణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధికారులను ఆదేశించారు. మంగళవారం పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని టన్నుల జొన్నలను కొనుగోలు చేశారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జొన్నలను తరలించాలని సూచించారు. 30వ తేదీ వరకు జొన్నలను కొనుగోలు చేస్తారని, అప్పటి వరకు రైతులు జొన్నలను తీసుకు రావచ్చని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివకుమార్, ఏఈఓ రెహమాన్, సొసైటీ కార్యదర్శి శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

హత్య ఘటనపై అదనపు ఎస్పీ విచారణ

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో భూ తగాదాతో అంకం అశోక్ హత్య జరిగిన ఘటనపై జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు మంగళవారం విచారణ జరిపారు. అశోక్ తండ్రి లక్ష్మయ్య తమ భూ వివాదానికి సంబంధించి కోర్టు స్టే ఉన్నందున ప్రత్యర్థులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డికి ఫిర్యాదుచేసి, కాళ్లు మొక్కినా స్పందించలేదని అందువల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపించడంతో అదనపు ఎస్పీ విచారణ జరిపారు. ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

మాక్లూర్: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ పశువుల కాపరి మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని రాంచంద్రాపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధీర్‌రావు కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేటకు చెందిన దుర్గయ్య బతుకు తెరువుకోసం గత సంవత్సరం తన భార్య దుర్గమ్మతో కలిసి రాంచంద్రాపల్లికి వచ్చి పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. రోజూలాగే సోమవారం పశువులను మేత కోసం తీసుకెళ్లాడు. పశువులు సింగసముద్రం చెరువులోకి దిగడంతో వాటిని బయటికి తీసుకొచ్చే క్రమంలో నీటిలో మునిగి మృతి చెందాడు. మొరం కోసం తవ్విన గుంతలో మునిగిపోగా సోమవారం రాత్రి కావడంతో గాలింపు చర్యలు చేపట్టలేదు. మంగళవారం ఉదయం దుర్గయ్య మృతదేహం లభ్యమవ్వడంతో పోలీసులు బయటికి తీయించి పంచనామా చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

31న మండల సర్వసభ్య సమావేశం

జిన్నారం(పటాన్‌చెరు): మండల సర్వసభ్య సమావేశాన్ని 31న నిర్వహించనున్నట్లు ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలని, అధికారులు పూర్తి వివరాలతో రావాలని కోరారు.

వీధికుక్కల పట్టివేతకు స్పెషల్ డ్రైవ్

మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని పలు వీధులలో ఓ పిచ్చికుక్క పలువురిని కరిచిన సంగతి తెలిసిందే. దీనిపై మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అప్రమత్తమయ్యారు. మంగళవారం వీధి కుక్కలను పట్టుకునేందుకు ఒక బృందాన్ని రంగంలోకి దింపారు. 8, 9, 10వ వార్డులలో పలు కుక్కలను పట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగిన ఘటన తిరిగి జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం పట్టుకున్న కుక్కలకు వ్యాక్సినేషన్ వేయించి జనన నియంత్రణ యూనిట్‌కు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొల్లూరి భరత్, మంజుల పాల్గొన్నారు.



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్ భరత్

గోశాల గోదాంలో అగ్నిప్రమాదం

రూ.1.50లక్షల ఆస్తి నష్టం

జోగిపేట(అందోల్): పట్టణంలోని శ్రీకృష్ణ గోశాలకు సంబంధించిన గోదాంలో అగ్నిప్రమాదం సంభవించింది. మంగళవారం సాయంత్రం గోదాంలో నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు నిర్వాహకులకు తెలియజేశారు. వారు అక్కడికి వెళ్లి గోశాల షట్టర్ తెరిచారు. అప్పటికే మంటలు అంటుకొని గడ్డివాములు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో 1200 గడ్డి వాములు దగ్ధమయ్యాయని, సుమారు రూ.1.50లక్షల నష్టం జరిగినట్లు గోశాల నిర్వాహకులు తెలిపారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పేకాట స్థావరంపై దాడి

ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.31లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన కొల్లూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఉస్మాన్‌నగర్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. దీంతో అక్కడికి వెళ్లి పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.31లక్షలు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎల్లమ్మ తల్లికి బోనాలు

మునిపల్లి(అందోల్): రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రమైన మునిపల్లి గ్రామంలో రేణుకా ఎల్లమ్మతల్లికి గ్రామస్తులు, భక్తులు డప్పు చప్పుళ్ల, పోతురాజుల విన్యాసాల నడుమ దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి బోనాలను సమర్పించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

◆ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జహీరాబాద్ టౌన్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మహిపాల్ పిలుపునిచ్చారు. శ్రామిక్ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు, చట్టాల రక్షణ, సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాజీలేని ఉద్యమాలు చేస్తోందన్నారు. 30న యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మికులు, పరిశ్రమల యూనియన్ నాయకులు పాల్గొనాలన్నారు. సమావేశంలో నర్సయ్య, ప్రభు, సూర్యకాంత్, బస్వరాజ్, సంజీవ్‌రెడ్డి, బాగన్న, అజీమ్, నిజాం పాల్గొన్నారు.

◆ 'అమ్మ ఆదర్శ' పనుల పరిశీలన

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని గొల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మండల విద్యాధికారి దండు అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ.. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోపు పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలో 45పాఠశాలల్లోని 57పనులకు రూ.1.56కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ప్రవీణ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

◆ 9మందికి జరిమానా

పటాన్‌చెరు: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 9 మంది వాహనదారులకు జిల్లాకోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆదివారం, సోమవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 9మందిని పట్టుకుని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలు, గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతులకు విత్తనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అధిక దిగుబడులు రావాలంటే విత్తన ఎంపిక చాలా కీలమైనదని, అనుమతులు కలిగిన డీలర్లవద్దే కొనుగోలు చేయాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని చెప్పారు.



నారాయణఖేడ్ రైతులకు అవగాహన కల్పిస్తున్న ఖేడ్ ఏఓ శంకర్



న్యాల్‌కల్(జహీరాబాద్):మొల్కన్‌పాడ్ గ్రామంలో..



రాయికోడ్(అందోల్)లో..



ఝరాసంగం(జహీరాబాద్)లో..

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400